సాక్షి విశాఖపట్నం


గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



కరాసాలో దొంగల బీభత్సం 8లో



సొంతగడ్డపై తెలుగు టైటాన్స్ హ్యాట్రిక్ 8లో



తాత్కాలిక హాల్ట్‌లు కొనసాగింపు 8లో

న్యూస్‌రీల్

23 నుంచి సింహగిరిపై శరన్నవరాత్రి ఉత్సవాలు



సింహాచలం: ఈ నెల 23 నుంచి అక్టోబరు 1 వరకు సింహగిరిపై శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు బుధవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఆలయంలో శ్రీ రామాయణ నవ రాత్ర పారాయణం ఉంటుందన్నారు. రోజూ సాయంత్రం 5 గంటలకు చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవార్లకు ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27న సింహవల్లీ తాయారు సన్నిధిలో వీరలక్ష్మీ ఆరాధనం, 29న మూల నక్షత్రం పురస్కరించుకుని ఆయుధపూజ నిర్వహిస్తామన్నారు. అక్టోబరు 2 విజయదశమి నాడు కొండదిగువ పూలతోటలో సాయంత్రం నుంచి జమ్మివేట ఉత్సవం, శమీపూజ జరపనున్నట్లు తెలిపారు. ఆ రోజు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి శ్రీరామాలంకారం చేసి కొండపైనుంచి మెట్ల మార్గంలో కొండ దిగువ పూలతోటకు తీసుకెళ్తామన్నారు. విజయదశమి నాడు సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సింహగిరిపై స్వామివారి దర్శనాలు లభిస్తాయన్నారు.

వైఎస్సార్ సీపీలో నియామకాలు



సీతంపేట : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ జిల్లాకు చెందిన పలువురు నాయకులను అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉత్తర నియోజకవర్గానికి చెందిన పలివెల ఈశ్వరిని రాష్ట్ర వీవర్స్ వింగ్ అధికారి ప్రతినిధిగా, పశ్చిమ నియోజకవర్గానికి చెందిన గంటా రాణిని రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా, ఎడ్ల సత్యంను రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా, గాజువాకకు చెందిన తుమ్మలూరు జగదీష్ రెడ్డిని రాష్ట్ర ఐటీ వింగ్ జోనల్ అధ్యక్షుడిగా, గంగుల రోజా రాణిని రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా, తూర్పు నియోజకవర్గానికి చెందిన వానపల్లి ఈశ్వరరావును రాష్ట్ర వీవర్స్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా, బెవర జగదీశ్వరరావును రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ సెక్రటరీగా నియమించారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కిరణ్ రాజు

సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా జి.ఎస్.వి.వి.ఎ.ఎం.రాజు(కిరణ్‌రాజు) నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

విశాఖ వ్యాలీ స్కూల్‌కి సీఫోర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ ఈశ్వరి

ఆరిలోవ: నగరంలోని సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ విధానంలో నడుస్తున్న పాఠశాలల్లో విశాఖ వ్యాలీ స్కూల్ సీఫోర్ ర్యాంకింగ్‌లో మొదటి స్థానంలో నిలిచింది. న్యూఢిల్లీకి చెందిన సీఫోర్ సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి సర్వేలో భాగంగా నగరంలోని పాఠశాలల్లో ఈ స్కూల్ అగ్రస్థానంలో నిలిచింది. దీంతో న్యూఢిల్లీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్‌కు సీఫోర్ ప్రతినిధులు అవార్డుతో పాటు జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఫోర్ ప్రతినిధులు తమ పాఠశాలలో పిల్లలు, వారి తల్లిదండ్రులతో పాటు స్థానికులను కూడా సర్వే చేశారని తెలిపారు. కో-ఎడ్యుకేషన్ పాఠశాలలో అనుసరిస్తున్న విద్యా విధానం, బోధనా పద్ధతులు, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, పర్యావరణ పరిరక్షణ, పాఠశాల నిర్వహణ, క్రీడలు, విద్యార్థులకు అందిస్తున్న నైపుణ్యాలు, కల్పిస్తున్న సౌకర్యాలు, తల్లిదండ్రుల భాగస్వామ్యం వంటి అంశాలను సర్వే చేసి.. పాఠశాలలకు జాతీయ స్థాయిలో ర్యాంకింగ్ ఇస్తారన్నారు. ఈ అంశాల్లో తమ పాఠశాల ఉత్తమంగా నిలవడంతో నగరంలోనే మొదటి స్థానాన్ని సాధించినట్లు వివరించారు. 1,190 మార్కులతో జాతీయ స్థాయిలో టాప్-50 పాఠశాలల్లో ఒకటిగా నిలిచిందని వెల్లడించారు.

నేడు విశాఖకు నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారు

గోపాలపట్నం : నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారు గురువారం మధ్యాహ్నం ఇండిగో విమానంలో విశాఖ రానున్నారు. నేపాల్‌లో జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో తెలుగువారిని దేశానికి తీసుకువస్తున్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది ఉత్తరాంధ్రవాసులు ఉన్నట్లుగా తెలుస్తోంది. వీరు మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో విశాఖ చేరుకుంటారు. వీరికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వాగతం పలుకుతారు. ఈ మేరకు వారి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చినట్లు సమాచారం.

మెట్రో కథ మళ్లీ మొదటికి!



- రేపటితో ముగియనున్న వైజాగ్ మెట్రో టెండర్ల గడువు
- ఒక్కరూ ఆసక్తి చూపించకపోవడంతో సర్కార్‌కి షాక్
- పలు సంస్థలతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ మంతనాలు
- వైట్ ఎలిఫెంట్ ప్రాజెక్ట్ అంటూ పెదవి విరిచిన సంస్థల ప్రతినిధులు
- ప్రాజెక్ట్ టెండర్లను ప్యాకేజీలుగా విభజిస్తామంటూ ప్రభుత్వం హామీ
- టెండర్ల గడువు అక్టోబర్ 7వ తేదీ వరకు పొడిగింపు



అనగనగా.. ఒక విశాఖ మెట్రో..

గత ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం చేసి
కేంద్రానికి పంపించింది.
ఇంతలో జట్టు కట్టి జనాన్ని మాటలతో
మభ్యపెట్టిన మాంత్రిక ప్రభుత్వం వచ్చింది.
హాశ్.. మెట్రో మీరు కాదు మేమే కదతామంటూ పాత డీపీఆర్‌ని రద్దు చేసేసింది.
అమరావతి మాదిరిగా డిజైన్లుండాలంటూ
కేంద్రానికి కొత్తగా డీపీఆర్ పంపించింది.
అదేమో.. అక్కడ ఆమోదించలేదాయే..
కూటమి సామ్రాజ్య నేతలు బతిమాలుతున్నా వాళ్లు పట్టించుకోలేదు.
అసలే 'సిక్స్' కొట్టబోయి.. సూపర్ ఫ్లాప్
అయిన బాబు జట్టు..
మరోసారి జనాలకు మాయమాటలు
చెప్పేందుకు సిద్ధమైంది.
ఇదిగో మెట్రో అంటే.. అదిగో టెండర్లు
అంటూ
ఊదరగొట్టారు.
ఆహా.. వైజాగ్‌కి మెట్రో
వచ్చేసిందంటూ.. సోషల్
మీడియా సామంతరాజులంతా గ్రాఫిక్స్
జిమ్మికులతో అదరగొట్టేశారు.
తీరా చూస్తే.. టెండర్లు గడువు ముగుస్తున్నా
ఎవరూ ముందుకు రాలేదు.
బాబ్బాబూ.. రండి.. వచ్చి టెండర్ పెట్టండి
అని బతిమాలుతున్నా పట్టించుకోలేదు.
ఇక లాభం లేదనుకొని.. ఈ 'భారీ'
ప్రాజెక్టును భాగాలుగా చేసి..
వాటాల
పేరుతో
టెండర్లు ఇవ్వాలని
నిర్ణయించారు. దీంతో
వైజాగ్ మెట్రో కథ మళ్లీ
మొదటికొచ్చింది.

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం చేసేది గోరంత.. చెప్పేది కొండంత. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు నిధులు ఎక్కడి నుంచి వస్తాయో తెలియకుండా.. కేంద్ర ప్రభుత్వం డీపీఆర్‌కు ఆమోదం చెప్పకుండానే గ్రాఫిక్ జిమ్మిక్కులు చూపించింది. ప్రజలను మభ్యపెట్టేందుకు జూలై 25న టెండర్లు పిలిచింది. మొదటి దశలో 46.23 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.6,250 కోట్లు(జీఎస్టీ అదనం)తో టెండర్లను ఆహ్వానించింది. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.11,498 కోట్లు కాగా.. మూడు కారిడార్లలో ఫేజ్-1 పనుల కోసం ఈపీసీ ప్రాతిపదికన ఏఎంఆర్‌సీ టెండర్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ పనులను మూడేళ్ల కాలపరిమితితో పూర్తి చేయాలని టెండర్ షెడ్యూలులో చెప్పింది. టెండర్ సమర్పించిన 180 రోజుల వరకూ బిడ్ వ్యాలిడిటీ ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ నెల 12వ తేదీతో టెండరు గడువు ముగియనుంది. ఒక్క సంస్థ కూడా టెండర్లలో పాల్గొనేందుకు సాహసించలేదు. దీంతో సర్కార్‌కి షాక్ తగిలినట్లయింది.

సమయమిస్తాం.. రండి.. ప్లీజ్.!

టెండర్లు వేసేందుకు ఎవరూ రాకపోవడంతో అసలు లోపం ఎక్కడుందో తెలుసుకునేందుకు ప్రభుత్వం.. కాంట్రాక్టు నిర్మాణ సంస్థలతో సమావేశం ఏర్పాటు చేసింది. ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీ బిడ్డింగ్ సమావేశంలో కారణాలు చెప్పాలంటూ అధికారులు కోరారు. భారీ మొత్తంలో ప్రాజెక్టు టెండరు దక్కించుకున్నా.. లాభార్జన సాధ్యం కాదనీ.. పైగా టెండర్‌లో నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడం అసాధ్యమని తెగేసి చెప్పినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత 30 నెలల్లో మొత్తం ప్రాజెక్టు పూర్తి చేయాలని షరతు విధించడంపై విమర్శలు వెల్లువెత్తినట్లు సమాచారం. దీంతో ఏం చేయాలో పాలుపోక టెండరు గడువు పొడిగిస్తామనీ సలహాలు, సూచనలు చెప్పాలని ప్రభుత్వం అభ్యర్థించింది. ప్యాకేజీలుగా విభజిస్తే ఆలోచిస్తామని కొన్ని సంస్థలు బదులిచ్చాయనీ.. దీంతో కూటమి ప్రభుత్వం పరువు పోగొట్టుకోకుండా ఉండేందుకు టెండరు ప్రక్రియని సమూలంగా మార్చేందుకు సిద్ధమవుతోంది. జాయింట్ వెంచర్ మోడల్‌లో పనులు చేసేందుకు అవకాశం కల్పించాలని కొన్ని సంస్థలు కోరాయి. దానికి కూడా అంగీకరించినట్లు సమాచారం. ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవాలని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ నిర్ణయించి.. టెండర్లు అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. మెట్రో రైల్ పాలక మండలి సమావేశంలో చర్చించిన అనంతరం ఎన్ని ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవాలో నిర్ణయం తీసుకోనున్నారు.

ప్రతి ఫేజ్‌లోనూ టెండర్ల విభజన..!

విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టును మొత్తం 140.13 కి.మీ మేర చేపట్టనున్నారు. తొలి దశలో 46.23 కి.మీ మేర చేపట్టనుండగా.. ఇందులో మొత్తం 42 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లు రానున్నాయి. ఇందులో 20.16 కి.మీ డబుల్ డెక్కర్ తరహాలో ఫ్లైఓవర్లు నిర్మిస్తారు. మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం, గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్ వరకూ పై వంతెనలు నిర్మిస్తారు. కొమ్మాది- స్టీల్‌ప్లాంట్, గురుద్వారా-పాతపోస్టాఫీసు, తాటిచెట్లపాలెం-చినవాల్తేరు కారిడార్లలో తొలి దశ కింద మెట్రోకు ప్రణాళిక చేశారు. కొమ్మాది-స్టీల్‌ప్లాంట్ మధ్య కారిడార్‌లో 34.40 కి.మీ మేర డబుల్ డెక్కర్ ట్రాక్ నిర్మించనున్నారు. అలాగే మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు 15.06 కి.మీ మేర రెండో కారిడార్‌ను నిర్మిస్తారు. గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్ మధ్య మరొక కారిడార్ ఏర్పాటు చేయనున్నారు. ఇలా ప్రతి ఫేజ్ పనుల టెండర్లను కూడా ప్యాకేజీలుగా విభజించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. మొత్తంగా ఏమీ లేకుండానే ఏదో చేసేస్తున్నామని డప్పులు కొట్టిన కూటమి ప్రభుత్వానికి మెట్రో షాక్ తగిలింది. ప్రాజెక్టులో ఎలాంటి పురోగతి లేకపోయినా టెండర్ల పేరుతో అరచేతిలో మెట్రో చూపించేందుకు కూటమి సర్కారు సిద్ధమవడం సిగ్గు చేటని పలువురు విమర్శిస్తున్నారు.

కేజీహెచ్ వార్డు బాయ్ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట: 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కేజీహెచ్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. వైద్యురాలి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై రోజుల తరబడి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిన అధికారులు.. 'కేజీహెచ్‌లో కీచకులు' శీర్షికన బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో ఉలిక్కిపడి.. దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వార్డు బాయ్ శంకరరావును సస్పెండ్ చేస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 26న గ్యాస్ట్రో ఎంట్రాలజీ వార్డులో మహిళా వైద్యురాలి పట్ల వార్డు బాయ్ శంకరరావు రెండుసార్లు అసభ్యకరంగా ప్రవర్తించారు. ఈ ఘటనపై తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె అదే రోజు కేజీహెచ్ సూపరింటెండెంట్, ఏఎంసీ ప్రిన్సిపాల్, విభాగాధిపతులతో పాటు వన్‌టౌన్ పోలీసులకు సైతం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ విషయంపై 'సాక్షి' దినపత్రికలో కథనం వెలువడింది. దీంతో కేజీహెచ్ యాజమాన్యం తర్జనభర్జనల అనంతరం చర్యలు తీసుకోవడానికి సిద్ధమైంది. వెంటనే సంబంధిత ఫైల్‌ను తయారు చేసి, శంకరరావును సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు ఈ ఘటనపై నాల్గవ తరగతి ఉద్యోగ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉన్నతాధికారుల తీరును నిరసిస్తూ భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు త్వరలో సమావేశం కానున్నట్లు తెలిసింది. కాగా.. సర్జరీ విభాగంలో బాలిక తల్లి పట్ల ఓ వైద్యుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఫిర్యాదుపై కూడా ఆస్పత్రి ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఈ ఘటనపై మహిళా కమిషన్ నుంచి కేజీహెచ్‌కు వచ్చిన రెండు ఈ-మెయిల్స్‌ను ఎవరు డిలీట్ చేశారన్న దానిపై కూడా అంతర్గత విచారణ మొదలైనట్లు సమాచారం.

స్టీల్‌ప్లాంట్‌లో కన్వేయర్‌ను కట్ చేసిన అగంతకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ రా మెటీయల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పీ)లో కన్వేయర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేశారు. సకాలంలో అధికారులు గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. రెండు రోజుల క్రితం ఆర్ఎంహెచ్‌పీ విభాగంలో విధి నిర్వహణలో భాగంగా కన్వేయర్ బెల్ట్‌ను ప్రారంభించారు. కొద్దిసేపటికి ఆ కన్వేయర్‌లో కొంత భాగం కట్ అయి ఉండడం గమనించి వెంటనే కన్వేయర్‌ను ఆపి వేశారు. అధికారులు సకాలంలో గుర్తించకపోతే ఆ కన్వేయర్‌తో పాటు పక్కన ఉన్న కన్వేయర్ కూడా ఆగిపోయేది. తద్వారా ముడి సరుకు రవాణాకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. ఈ సంఘటనపై యాజమాన్యం ఆగ్రహం వ్యక్తం చేసింది. జరిగిన సంఘటనపై విభాగం అధికారులు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన సీఐ కేశవరావు సంఘటనా స్థలానికి వెళ్లి కన్వేయర్‌ను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అంగట్లో ఆశ పోస్టులు

- వైద్య ఆరోగ్య శాఖలో 68 పోస్టులకు దరఖాస్తులు
- పోస్టుల కోసం పెద్ద ఎత్తున పైరవీలు
- ఒక్కో పోస్టుకు రూ.3 లక్షలు డిమాండ్?
- కొంతమందికి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు సిఫార్సు లేఖలు



మహారాణిపేట : ఆశ వర్కర్ల పోస్టులకు ధర భారీగా పలుకుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ పోస్టులకు డిమాండ్ పెరిగింది. ఇటు కూటమి నాయకులు, అటు కార్పొరేటర్లు పైరవీలను ముమ్మరం చేశారు. మరోవైపు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు రావడం, వాటిని ఆసరాగా తీసుకొని వైద్య ఆరోగ్యశాఖలో కొంతమంది సిబ్బంది తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పోస్టుల భర్తీలో డీఎంహెచ్‌వో మీద ఒత్తిడి వస్తున్నట్లు తెలుస్తోంది. డీఎంహెచ్‌వోకి ఒక వైపు సిఫార్సులు లేఖలు, మరో వైపు ఎమ్మెల్యే పీఏల నుంచి ఫోన్లు వస్తున్నాయి.

68 పోస్టులకు 6వేలకు పైగా దరఖాస్తులు

విశాఖ జిల్లాలో 68 ఆశ వర్కర్ల పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా.. ఆరు వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ పోస్టులకు భారీగా పోటీ నెలకొంది. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన జరుగుతోంది. మెరిట్‌తోపాటు రోస్టర్ ప్రకారం పోస్టులను భర్తీ చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ఈనెల 15వ తేదీలోగా పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయడానికి అన్ని చర్యలు చేపట్టారు.

కూటమి నేతల బేరసారాలు : ఆశ వర్కర్ల పోస్టుల కోసం కొంత మంది కూటమి నేతలు బేరసారాలకు దిగారు. అభ్యర్థులు స్థానిక నేతలను కలవగా వారు బేరం పెట్టేశారు. ఒక్కో పోస్టుకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు తీసుకున్నట్లు తెలుస్తోంది. కొంత మంది కోసం స్థానిక కార్పొరేటర్లు సిఫార్సు చేస్తున్నారు. కొంతమంది అభ్యర్థులు ఎమ్మెల్యేను కలిసి సిఫార్సు లేఖలను తీసుకొని నేరుగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇస్తున్నట్లు సమాచారం. అయితే సిఫార్సు లేఖ ఇచ్చిన ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది బేరాలకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు లేఖలు రావడంతోపాటు డబ్బులు వసూలు చేస్తుండడంపై కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కింద స్థాయి పోస్టులను కూడా ఎమ్మెల్యేల కార్యాలయం నుంచి బేరసారాలు పెట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. మరోవైపు సిఫార్సు లేఖలతో వచ్చిన అభ్యర్థులతో వైద్య ఆరోగ్య శాఖలో కొంతమంది సిబ్బంది.. ఉద్యోగం వచ్చిన తరువాత డబ్బులు ఇవ్వండని మాట్లాడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

'ప్రసాద్' పనులు వేరొక కాంట్రాక్టర్‌కు అప్పగింత

సింహాచలం: సింహగిరిపై నిలిచిన ప్రసాద్ స్కీమ్ పనులను టూరిజం శాఖ వేరొక కాంట్రాక్టర్‌కి అప్పగించింది. దీంతో ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం సింహాచలం దేవస్థానానికి మంజూరు చేసిన రూ.54 కోట్ల ప్రసాద్ స్కీమ్ పనులను టూరిజం శాఖ రెండేళ్ల క్రిందట ప్రారంభించింది. ఆ పనుల్ని రెండుగా విభజించి సింహగిరిపై జరిగే కొన్ని పనుల్ని ఓ కాంట్రాక్టర్‌కి, కొండదిగువ మరికొన్ని పనుల్ని మరో కాంట్రాక్టర్‌కు అప్పగించింది. ఇందులో భాగంగానే నాసిరకం గోడ నిర్మించడంతో చందనోత్సవం రోజు ఆ గోడ కూలి ఏడుగురు భక్తులు మృతిచెందారు. దీంతో ఆ కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టి, టెండర్లు రద్దు చేశారు. అప్పటి నుంచి నిలిచిన పనుల్ని టెండర్ ద్వారా నగరానికి చెందిన చైతన్య కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించారు. మొత్తం రూ.32 కోట్ల పనుల్లో 70 శాతం పాత కాంట్రాక్టరే పూర్తి చేశారు. కాగా.. సింహగిరికి బుధవారం వచ్చిన టూరిజం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ గోడకూలి భక్తులు మృతిచెందిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో దేవస్థానమే చేపట్టిన మెట్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రసాద్ పథకం పనుల్ని నాణ్యతగా, వేగంగా చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.



సింహగిరిపై భక్తులు మృతి చెందిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్

విశాఖ అభివృద్ధికి బృహత్ ప్రణాళిక



జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

దాబాగార్డెన్స్: విశాఖ నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఆపరేషన్ లంగ్స్ కింద ప్రభుత్వ స్థలాలు గుర్తించామని, వాటిలో పార్కులు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వార్డుకి ఒకటి చొప్పున వెండింగ్ జోన్స్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే 76 వార్డుల్లో స్థలాలను గుర్తించామని, గుర్తింపు కార్డులు త్వరలో జారీ చేస్తామన్నారు. బుధవారం తన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన నగరాభివృద్ధికి సంబంధించిన పలు ప్రణాళికలను వివరించారు.

రోడ్ల విస్తరణే ప్రధాన ఎజెండా

'జీవీఎంసీ పరిధిలో 114 ప్రధాన రహదారులను అభివృద్ధి చేయనున్నాం. ప్రతి వార్డులో ఒక ప్రధాన రహదారితో పాటు, ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన మరో 14 రోడ్లను విస్తరించనున్నాం. భూ సమీకరణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు జోనల్ కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, వీఆర్వోలతో ఒక కమిటీని ఏర్పాటు చేశాం. నగరంలో సీసీ, బీటీ రోడ్ల అభివృద్ధికి రూ.250 కోట్లు కేటాయించగా, కొన్ని పనులు పూర్తయ్యాయి. మరికొన్ని టెండర్ల దశలో ఉన్నాయి.' అని కమిషనర్ వివరించారు. చంద్రంపాలెం వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు.

మురుగునీరు శుద్ధి

అప్పుఘర్ నుంచి భీమిలి వరకు 13 డ్రెయిన్లను అనుసంధానిస్తూ.. అప్పుఘర్, సాగర్‌నగర్, భీమిలిలో మూడు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు(ఎస్‌టీపీలు) నిర్మిస్తామని కమిషనర్ తెలిపారు. ఇక్కడ శుద్ధి చేసిన నీటిని నరవకు తరలించి, అక్కడి నుంచి పరిశ్రమలకు సరఫరా చేస్తామన్నారు. ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా నగరంలో గుర్తించిన 1,480 బహిరంగ స్థలాల్లో.. 385 స్థలాలను ఇప్పటికే పార్కులుగా అభివృద్ధి చేసినట్లు వివరించారు. మిగిలిన స్థలాలకు ఫెన్సింగ్ వేసి, ఆక్రమణల నుంచి కాపాడామని కమిషనర్ స్పష్టం చేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు నూతన వ్యవస్థ

'నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఆటోమేటెడ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టంను త్వరలో ప్రవేశపెట్టనున్నాం. 14 ప్రధాన జంక్షన్లలో ఫ్రీ లెఫ్ట్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించాం. సిగ్నలింగ్ వ్యవస్థను అనుసంధానించి, ఒక జంక్షన్ దాటిన వాహనాలకు తదుపరి జంక్షన్‌లో కూడా గ్రీన్ సిగ్నల్ పడేలా కొత్త విధానాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఇటీవల జరిగిన గిరి ప్రదక్షిణ రోజున పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టాం. నగరంలో మొత్తం 115 జంక్షన్లు ఉండగా.. పోలీసుల సహకారంతో తొలి దశలో 50 జంక్షన్లలో దీనిని అమలు చేయనున్నాం'అని కమిషనర్ వివరించారు.

భవన నిర్మాణాలపై కఠిన వైఖరి

సర్వే సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఈ నెల 30 నాటికి ఆన్‌లైన్ పోర్టల్ తీసుకువస్తున్నట్లు కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. సర్వే చేయించుకోవాలనుకునే వారు ఇకపై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భవన నిర్మాణాలు పూర్తయ్యాక, ప్లాన్‌కు అనుగుణంగా ఉన్నాయో లేదో తనిఖీ చేస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ నిరాకరించడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఫుడ్ స్టాళ్లు, హోటళ్లపై తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. గత నెలలో 191 హోటళ్లలో తనిఖీలు నిర్వహించి, నాణ్యతా ప్రమాణాలు పాటించని 170 హోటళ్ల యాజమాన్యాలకు రూ.2,71,900 జరిమానా విధించినట్లు కమిషనర్ కేతన్ గార్గ్ వెల్లడించారు.

ఆదుకోవాలని ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల ర్యాలీ

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సులు అందుబాటులోకి రావడం వల్ల తమ ఆదాయం 80 శాతం తగ్గిందని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ రెహ్మాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసుబాబు తెలిపారు. ఇంటి అవసరాలు, పిల్లల స్కూలు ఫీజులు, కరెంటు చార్జీలు, అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ పార్కు నుంచి గురజాడ అప్పారావు బొమ్మ మీదుగా తిరిగి గాంధీ బొమ్మ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబర్ 21, 31 వల్ల భారీగా జరిమానాలు విధిస్తున్నారని, దీనికి తోడు స్త్రీ శక్తి పథకం తమను ఆర్థికంగా దెబ్బతీసిందన్నారు. ఆదాయం లేక వాహనాలకు ఫైనాన్స్ సకాలంలో చెల్లించలేకపోతున్నామని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కడానికి ప్రభుత్వం ప్రతి నెలా రూ.5,000 తమ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ గ్యాస్‌పై 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. ఈ-చలాన్ కేసులను రద్దు చేయాలని, మోటార్ కార్మికుల భద్రత కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వాహనాలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, ప్రమాదంలో చనిపోయిన డ్రైవర్లకు రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సుమారు 60 వేల మంది ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు ఉన్నారని, వారి కుటుంబాలను ఆదుకునేందుకు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ర్యాలీలో ఫెడరేషన్ ప్రతినిధులు సాయికుమార్, నాగేశ్వరరావు, రాంబాబు, బుజ్జిబాబు, అప్పలరాజు, అన్నాజీ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు

పత్రికా స్వేచ్ఛకు భంగం




జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం సరికాదు. పత్రికల్లో ప్రచురితమైన వార్తలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే.. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయవచ్చు లేదా పరువు నష్టం దావా వేయవచ్చు. అంతేగానీ పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి తీవ్రమైన నష్టం. గతంలో ఎప్పుడూ కూడా ఈ విధంగా జర్నలిస్టులపై కేసులు నమోదు చేయలేదు. ఈ విధమైన వైఖరి వల్ల జర్నలిస్టులు సరైన వార్తలు పాఠకులకు అందించలేరు. వాస్తవాలను రాయడానికి, నిజానిజాలు వెల్లడించడానికి వెనుకంజ వేసే ప్రమాదం ఉంది. జర్నలిస్టుల స్వేచ్ఛకు ఇబ్బందులు కలగకుండా తగిన విధంగా ఆలోచన చేయాలి.

– గంట్ల శ్రీనుబాబు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి



సాక్షి ఎడిటర్‌పై వేధింపులు సరికాదు



సాక్షి కార్యాలయంపై పోలీసులు దాడులు చేయడం, తాజాగా ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై పలు సెక్షన్ల కింద కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేయడం కక్ష సాధింపులో ఓ భాగమే. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఓ నేత మాట్లాడిన విషయాలను వార్తగా ప్రచురించడంపై కూడా కేసు పెట్టడం, నోటీసుల పేరిట వేధించడం సబబు కాదు. భారత రాజ్యాంగం జర్నలిస్టులకు కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేసే ప్రయత్నం చేయడం అప్రజాస్వామికం. అన్యాయాన్ని, అవినీతిని, ప్రజా సమస్యలను తన కలంతో వెలికితీయడమే జర్నలిస్టుల వృత్తి. అలాంటి పత్రికా స్వాతంత్ర్యాన్ని, జర్నలిస్టుల కలాన్ని పోలీసు కేసులతో నియంత్రించాలని చూస్తే అది చాలా పెద్ద పొరపాటు అవుతుంది. ఏదైనా వార్త అవాస్తవమని భావిస్తే, దానికి ప్రభుత్వం వివరణ కోరాలి. కానీ కేసులు నమోదు చేయడం సరైంది కాదు.

– సీహెచ్‌బీఎల్ స్వామి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి జిల్లా

శ్రీవారి ఆలయంలో నాగుపాము కలకలం



పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ కిరణ్

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి(టీటీడీ) ఆలయంలో బుధవారం సాయంత్రం నాగుపాము సంచరించడం కలకలం రేపింది. కొండపైన ఉన్న ఆలయ ప్రాంగణంలోకి పాము రావడాన్ని భక్తులు గమనించి, వెంటనే ఆలయ నిర్వాహకులకు తెలిపారు. అప్రమత్తమైన నిర్వాహకులు స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న కిరణ్ ఆ పామును పట్టుకుని.. జనసంచారం లేని ప్రదేశంలో వదిలిపెట్టారు. దీంతో భక్తులు, నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

రాజమండ్రి, కాకినాడకు ఎక్స్‌ప్రెస్‌లు నడపాలి

డయల్ యువర్ ఆర్‌ఎంకు స్పందన



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

అల్లిపురం : ఏపీఎస్ ఆర్టీసీ విశాఖపట్నం రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు బుధవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్‌ఎమ్ ప్రోగ్రామ్‌కు స్పందన లభించింది. ప్రయాణికులు ఆర్టీసీ సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని ఆర్‌ఎం తెలిపారు. విశాఖ నుంచి రాజమండ్రి, కాకినాడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు చాలా తక్కువ ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని.. తగినన్ని బస్సులు నడపాలని పలువురు ప్రయాణికులు కోరారు. రాత్రి వేళలో సిటీ బస్సులు అదనపు ట్రిప్పులు నడపాలని కొందరు ప్రయాణికులు కోరారు. ద్వారకా బస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు, రామాటాకీస్ వరకు ప్రైవేట్ బస్సులు ఆపకుండా అరికట్టడంపై పలువురు ధన్యవాదాలు తెలిపారు. మొత్తం 18 మంది ఫోన్ చేశారని.. వారి సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుంటామన్నారు.

దివ్యాంగుల పింఛన్లు రద్దు చేయొద్దు

- జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- పంచాయతీరాజ్ అధికారుల తీరుపై జెడ్పీటీసీ సభ్యుల అసంతృప్తి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర. చిత్రంలో సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: దివ్యాంగుల పింఛన్ల రీ వెరిఫికేషన్ చేసినప్పటికీ.. అర్హులైన వారందరికీ పింఛన్లు కొనసాగించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఆమె అధ్యక్షతన పలు స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ 40 శాతం లోపు వైకల్యం ఉందంటూ దివ్యాంగులకు నోటీసులు ఇచ్చి, సదరం సర్టిఫికెట్లను మళ్లీ వెరిఫికేషన్ చేస్తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దివ్యాంగుల పింఛన్ల విషయంలో పలు రకాలుగా వేధిస్తున్నారని, దీని వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్.. దివ్యాంగుల పింఛన్లను రద్దు చేయవద్దన్నారు. ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని, పంచాయతీల్లో ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాగా.. అనకాపల్లి జిల్లా, పరవాడ మండలంలోని పంచాయతీరాజ్ అధికారుల పనితీరుపై జెడ్పీటీసీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

జేఈపై చర్యలు తీసుకోవాలి

పరవాడలో ఇప్పటికే సీసీ రోడ్లు ఉన్న చోట మళ్లీ కొత్త రోడ్ల కోసం ప్రతిపాదనలు చేయడం, వాటికి ఆమోదం తెలిపిన తర్వాత పనులు నిలుపుదల చేయడంపై పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు అభ్యంతరం తెలిపారు. ఈ విధంగా తప్పుడు ప్రతిపాదనలు చేసిన జేఈపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆరోగ్యశ్రీ, కేజీహెచ్ సేవలపై చర్చ

కేజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ ఐ.వాణికి ఫోన్ చేస్తే స్పందించడం లేదని కె.కోటపాడు జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ ఆరోపించారు. తాము సొంత పనుల కోసం ఫోన్ చేయమని, పేద రోగులకు వైద్యం కోసమే ఫోన్ చేస్తామని, అయినా అధికారి స్పందించకపోవడం దారుణమన్నారు. ఆరోగ్యశ్రీ పథకం సక్రమంగా అమలు కావడం లేదని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేద రోగులకు వైద్య సేవలు అందేలా చూడాలని పలువురు జెడ్పీటీసీ సభ్యులు కోరారు. దీనిపై విశాఖ జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు స్పందిస్తూ.. ఆరోగ్యశ్రీ కింద 3,000కు పైగా ప్రొసీజర్లకు చికిత్స అందిస్తున్నామని, కార్డు ఉన్న వారందరికీ సేవలు అందుతున్నాయని తెలిపారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి మాట్లాడుతూ ఆసుపత్రిలో పూర్తి స్థాయి క్యాన్సర్ చికిత్స, గుండె ఆపరేషన్లు జరుగుతున్నాయని, వెంటిలేటర్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గిరిజన ప్రాంతాల్లో విద్య, వసతి సమస్యలు

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని అనంతగిరి జెడ్పీటీసీ సభ్యులు గంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో టీచర్ల కొరత తీవ్రంగా ఉందని, వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన విద్యాశాఖ అధికారులు.. త్వరలోనే ఉపాధ్యాయ నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారు.

పీఎం–సూర్య ఘర్‌పై అవగాహన

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 నంబర్‌కు ఫోన్ చేస్తే.. 4 గంటల్లోపు సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పీఎం–సూర్య ఘర్ పథకం ద్వారా ప్రజలు విద్యుత్ బిల్లుల భారం నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. జెడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి, మూడు జిల్లాల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యల పరిష్కారంలో భాగస్వాములవ్వండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపు
- బ్లూమ్‌బర్గ్ మేయర్స్ చాలెంజ్ ఫైనలిస్ట్‌గా విశాఖ

అల్లిపురం: ప్రతిష్ఠాత్మకమైన బ్లూమ్‌బర్గ్ మేయర్స్ చాలెంజ్ 2025లో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 50 ఫైనలిస్ట్ నగరాల్లో విశాఖ ఒకటిగా నిలిచిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. పట్టణ సమస్యలకు వినూత్న పరిష్కారాలు కనుగొనడంలో విశాఖపట్నానికి లభించిన అంతర్జాతీయ గుర్తింపు ఇది అని కమిషనర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. 99 దేశాల నుంచి 600 కంటే ఎక్కువ నగరాలు పోటీపడగా, బ్లూమ్‌బర్గ్ మేయర్స్ చాలెంజ్‌కు విశాఖ ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పరిష్కారాలు కనుగొనాలనే జీవీఎంసీ నిబద్ధతను ఇది సూచిస్తుందన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా జీవీఎంసీ 'వైజాగ్–ప్రజాముఖి అర్బన్ లివింగ్ ల్యాబ్' అనే కొత్త విధానాన్ని అవలంబిస్తోందని.. ఈ నమూనాలో మొదటి దశగా 19వ వార్డులోని శివగణేష్‌నగర్‌లో వాతావరణ మార్పుల నుంచి రక్షణ కోసం ప్రజల నుంచి సలహాలు, సూచనలను ఆహ్వానిస్తోందన్నారు. జీవీఎంసీ 'వి–పుల్' అనే ప్రత్యేక వేదిక ద్వారా ప్రజలు, వివిధ సంస్థలు, సాంకేతిక నిపుణులను భాగం చేస్తూ పరిష్కారాలను కనుగొనేందుకు ప్రయత్నిస్తోందని.. గతంలో 41వ వార్డులో నిర్వహించిన వర్క్‌షాప్‌లు విజయవంతం కావడంతో, ఇప్పుడు ఈ విధానాన్ని 19వ వార్డులో విస్తరిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా తుపానులు, వరదలు, అధిక ఉష్ణోగ్రతల వంటి వాతావరణ మార్పుల వల్ల ఎక్కువగా ప్రభావితమయ్యే మత్స్యకార కుటుంబాల సమస్యలపై ఈ ప్రాజెక్ట్‌లో దృష్టి సారించామని, ప్రతి ఒక్క పౌరుడు తమ ఆలోచనలు, సూచనలు పంచుకోవాలని కమిషనర్ కోరారు. జీవీఎంసీ అధికారిక వెబ్‌సైట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలు, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తమ ఆలోచనలు పంచుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు వార్డు సచివాలయాలను సంప్రదించవచ్చని సూచించారు. జీవీఎంసీ ఎస్‌ఆర్‌యూ ప్రతినిధి స్వప్న, వి–పుల్ ప్రాజెక్ట్ మేనేజర్ ఇమ్మానుయేల్, జూనియర్ కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ ఆఫీసర్ జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలపై దాడులు

రూ.2.66 లక్షల సామగ్రి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బాణసంచా సామగ్రి

దాబాగార్డెన్స్: అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తున్న ముగ్గురు వ్యాపారులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.2.66 లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సీటీఎఫ్ ఎస్‌ఐ భరత్‌కుమార్ తెలిపిన వివరాలివి. వన్‌టౌన్ కురుపాం మార్కెట్ ప్రాంతంలో లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం మూడు దుకాణాలపై దాడులు నిర్వహించారు. కురుపాం మార్కెట్‌కు చెందిన పాలూరి వరప్రసాద్ దుకాణం నుంచి రూ. 2.06లక్షల విలువైన బాణసంచా సామగ్రి, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే బండారు అప్పలరాజు నుంచి రూ. 50వేలు, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన బొటాట భవానీశంకర్ నుంచి రూ.10 వేలు విలువ చేసే మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ వ్యాపారంపై కేసు నమోదు చేసి, తదుపరి విచారణ కోసం వారిని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్‌ఐ భరత్ తెలిపారు.

గొర్రెల మందపైకి దూసుకొచ్చిన ట్రాలర్

35 గొర్రెలు, 5 పిల్లలు మృతి



ప్రమాదంలో మృత్యువాత పడ్డ గొర్రెలు

తగరపువలస : ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలెం జాతీయ రహదారిపై గొర్రెల మందపైకి ట్రాలర్ దూసుకొచ్చిన సంఘటనలో 35 గొర్రెలు, 5 పిల్లలు మృతి చెందగా.. మరో 10 వరకు తీవ్రంగా గాయపడ్డాయి. ఇదే మండలం పేకేరు పంచాయతీకి చెందిన దివ్యాంగుడు చందక సూర్యనారాయణ, ఆయన సోదరుడు వీరుబాబు మూడు రోజుల కిందట గొర్రెల మందతో వచ్చి మిందివానిపాలెం వీతం కళాశాల ప్రాంతంలో ఉంటున్నారు. స్థానిక రైతుల వ్యవసాయ భూముల్లో మంద ఆయ వేస్తున్నారు. సర్వీస్‌రోడ్డు నుంచి గొర్రెలను జాతీయ రహదారి దాటిస్తుండగా పెందుర్తి వైపు నుంచి ఆనందపురం వైపు ద్విచక్రవాహనాల లోడుతో వేగంగా వస్తున్న ట్రాలర్ అదుపులోకి రాకపోవడంతో మందపైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో సూర్యనారాయణ రోడ్డుపై పడిపోయి స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం కారణంగా వారికి రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఆనందపురం ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు, ఆర్‌ఎస్ మొబైల్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల రైతులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరు బాట



పోరుబాట గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

మురళీనగర్: కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలపై ఎటువంటి స్పందన లేకపోవడంతో ఉపాధ్యాయులు పోరు బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గురువారం నుంచి 17వ తేదీ వరకు నిరసన వారంగా పాటించాలని నిర్ణయించారు. ఈ మేరకు మురళీనగర్‌లోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో పోరుబాట గోడ పత్రికను ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ కరుణాకర్, టి.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కొటా శ్రీను, వివిధ మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి ఆవిష్కరించారు. 11న నల్లబాడ్జీలతో విధులకు హాజరు, 12న మండల కేంద్రాల్లో నిరసన, 13, 14 తేదీల్లో ప్రజాప్రతినిధులకు వినతి పత్రాల సమర్పణ, 15న పాత తాలూకా కేంద్రాల్లో నిరసన, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన, 17న ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీలకు వాట్సాప్, ఈ–మెయిల్ ద్వారా వినతులు పంపించడం చేస్తామన్నారు.

వాల్తేర్ డివిజన్ ఏడీఆర్‌ఎంగా రామారావు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్)గా కె.రామారావు నియమితులయ్యారు. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వేలో విధులు నిర్వర్తిస్తున్న రామారావు వాల్తేర్ డివిజన్‌కు బదిలీపై రానున్నారు. ఈ మేరకు రైల్వే బోర్డు నుంచి బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ప్రస్తుతం వాల్తేర్ డివిజన్ ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్)గా మనోజ్‌కుమార్ సాహూ ఉన్నారు.

సొంతగడ్డపై తెలుగు టైటాన్స్ హ్యాట్రిక్

నేటితో విశాఖలో ముగియనున్న ప్రోకబడ్డీ

విశాఖ స్పోర్ట్స్: ప్రో కబడ్డీ లీగ్(పీకేఎల్) 12వ సీజన్‌లో భాగంగా విశాఖ పోర్టు స్టేడియం క్రీడాభిమానుల కేరింతలతో మార్మోగిపోతోంది. సొంతగడ్డపై తెలుగు టైటాన్స్ జట్టు అద్భుత ప్రదర్శనతో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసి, అభిమానుల్లో పండగ వాతావరణాన్ని నింపింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో మాజీ చాంపియన్ యూ ముంబ జట్టును 45–37 తేడాతో టైటాన్స్ చిత్తు చేసింది. ఆల్‌రౌండర్ భరత్ 13 పాయింట్లతో అదరగొట్టగా.. రైడర్ చేతన్ (6), కెప్టెన్ విజయ్ (5) కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో తెలుగు టైటాన్స్ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మరో మ్యాచ్‌లో మాజీ చాంప్ పునేరి పల్టన్ 43–32తో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది. పల్టన్ రైడర్లు పంకజ్ మోహితే (10), ఆదిత్య షిండే (12) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. యూపీ తరఫున గగన్ గౌడ (13) ఒంటరి పోరాటం చేశాడు. ఈ విజయంతో పునేరి పల్టన్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. కాగా.. విశాఖ వేదికగా జరుగుతున్న తొలి దశ పోటీలు గురువారంతో ముగియనున్నాయి. చివరి రోజు కూడా ప్రేక్షకులను అలరించేందుకు రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. రాత్రి 8 గంటలకు యూ ముంబ, పాట్నా పైరేట్స్, రాత్రి 9 గంటలకు దబాంగ్ ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్ జట్లు తలపడనున్నాయి.

కరాసాలో దొంగల బీభత్సం

ఒకే రాత్రి 5 ఇళ్లలో చోరీ



వివరాలు సేకరిస్తున్న డీసీపీ లతా మాధురి

గోపాలపట్నం: కరాసాలో దొంగలు బీభత్సం సృష్టించారు. బుధవారం రాత్రి ఐదు ఇళ్లలో చోరీకి పాల్పడి స్థానికులను భయాందోళనలకు గురి చేశారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లలో వరుసగా దొంగతనాలు జరిగాయి. జీవీఎంసీ 52వ వార్డు కరాసాలో ప్రియాంక కాలనీలోని ఏసుబాబు, దేవి సప్లయర్స్ శ్రీను, రామాలయం వీధిలోని అభీష్, దుంపంవారి వీధిలోని పద్మ, బేరివారి వీధిలోని శ్రీను ఇళ్లలో చోరీ జరిగిందని స్థానికులు తెలిపారు. అయితే నాలుగు ఇళ్లలో చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ నాలుగు ఇళ్లలో సుమారు 11 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.15వేల నగదు పోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ సమాచారంతో డీసీపీ లతా మాధురి, వెస్ట్ సబ్‌డివిజన్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐలు కె.రామారావు, చంద్రశేఖర్, ఎస్‌ఐలు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. పరిసర ప్రాంతాలను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. దొంగల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డీసీపీ తెలిపారు.

తాత్కాలిక హాల్ట్‌లు కొనసాగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ మేరకు పలు రైళ్లకు పలు స్టేషన్లలో కొనసాగుతున్న తాత్కాలిక హాల్ట్‌లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 2026 ఫిబ్రవరి 2వ తేదీ వరకు పూరి–తిరుపతి(17479) ఎక్స్‌ప్రెస్‌కు చినగంజాం స్టేషన్‌లో, ఫిబ్రవరి 3వ తేదీ వరకు గుంటూరు–రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్‌కు భీమడోలు స్టేషన్‌లో, విశాఖపట్నం–సికింద్రాబాద్–విశాఖపట్నం (20833/20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు సామర్లకోట స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది. ఫిబ్రవరి 5వ తేదీ వరకు బిలాస్‌పూర్–తిరుపతి(17481)ఎక్స్‌ప్రెస్‌కు చిన గంజాం స్టేషన్‌లో, ఫిబ్రవరి 25వరకు విశాఖపట్నం–సికింద్రాబాద్(20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు, ఫిబ్రవరి 26 వరకు సికింద్రాబాద్–విశాఖపట్నం (20707) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఏలూరు స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుందని డీసీఎం వెల్లడించారు.

పలు రైళ్లకు అదనపు హాల్ట్‌లు

- భువనేశ్వర్–కేఎస్‌ఆర్ బెంగళూరు–భువనేశ్వర్(18463/18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు బుధవారం నుంచి ఇరువైపులా దొనకొండ స్టేషన్‌లో అదనపు హాల్ట్ కల్పించారు.
- విశాఖపట్నం–కడప–విశాఖపట్నం(18521/18522) తిరుమల ఎక్స్‌ప్రెస్ బుధవారం నుంచి నందలూరు స్టేషన్‌లో ఆగుతుంది.
- పూరి–తిరుపతి(17479) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11 నుంచి, తిరుపతి–పూరి(17480) ఎక్స్‌ప్రెస్ 12 నుంచి అత్తిలి స్టేషన్‌లో ఆగుతుంది.

పలు రైళ్ల రీషెడ్యూల్

ఖరగ్‌పూర్ డివిజన్ బహనగ బజార్ స్టేషన్ యార్డ్ పరిధిలో ఆధునికీకరణ పనులు జరుగుతున్న కారణంగా పలు రైళ్లను రీషెడ్యూల్ చేశారు. ఈ రైళ్లు ఆయా స్టేషన్లకు అంతే ఆలస్యంగా చేరుకుంటాయని రైల్వే అధికారులు తెలిపారు.

- ఈ నెల 13న చర్లపల్లి–సిల్చార్(12513) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా రాత్రి 6.45 గంటలకు, సికింద్రాబాద్–హౌరా(12704) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.55 గంటలకు, ఎస్‌ఎంవీటి బెంగళూరు–కామాఖ్య (12551) ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా ఉదయం 10.50 గంటలకు బయలుదేరనున్నాయి.